
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 2 । నవంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి వీటూరి వరలక్ష్మి(విజయనగరం) బుధవారం రూ లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.




బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం

కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి 10వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి.

10లో

11,300 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 11,300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ఈ కింద తెలిపిన విలేజ్ హెల్త్ క్లినిక్, యూపీహెచ్‌సీల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. వేమగిరి -3 (కడియం), గాడాల (కోరుకొండ), శెట్టిపేట (నిడదవోలు), బొమ్మూరు-1 (రాజమహేంద్రవరం రూరల్), కలవచర్ల (రాజానగరం), రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, ఆనంద నగర్, కంబాలపేట, మెరకవీధి, సారంగధర మెట్ట యూపీహెచ్‌సీలలో జరుగుతాయన్నారు.

సైకిల్‌పై శబరిమల యాత్ర



శబరిమలకు పయనమవుతున్న శివస్వామి

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామానికి చెందిన జుజ్జూరి శివకుమార్ బుధవారం తన స్వగ్రామం నుంచి సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ 16 సార్లు శబరిమలకు వెళ్లానని, ఇప్పుడు 17వసారి ప్రయాణమైనట్టు తెలిపారు. శబరిమల సుమారు 1300 కిలోమీటర్లు దూరమని, రోజుకు 100 కిలోమీటర్ల చొప్పున 13 నుంచి 14 రోజులు పడుతుందన్నారు. మార్గం మధ్యలో కొందరు స్వాములు కలుస్తారని వారితో కలిసి వెళ్తానన్నారు. శివస్వామికి తొర్రేడు స్వాములు పరిసర గ్రామాల స్వాములు పూలమాలలు వేసి వీడ్కోలు పలికారు.

డాక్టర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీనియర్ రెసిడెంట్స్ (డాక్టర్ల) నియామకానికి శుక్రవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. అనాటమీ 5, ఫిజియాలజీ 3, బయోకెమిస్ట్రీ 4, ఫార్మకాలజీ 4, పాథాలజీ 2, మైక్రోబయోలజీ 4, ఫోరెనిక్స్ మెడిసిన్ 3, కమ్యూనిటీ మెడిసిన్ 3, జనరల్ మెడిసిన్ 2, డెర్మటాలజీ 1, జనరల్ సర్జరీ 1, అప్తమాలజీ 1, రేడియో డయాగ్నోసిస్ 2, అత్యవసర మెడిసిన్ 6 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

తొలిరోజు 68.86 శాతం పింఛన్ల పంపిణీ



చికిత్స పొందుతున్న లీలావతికి వితంతు పింఛన్ అందిస్తున్న వలంటీర్ యాళ్ల సందీప్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీని బుధవారం ఉదయమే వలంటీర్లు ప్రారంభించారు. ఐదు గంటలకే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్లు పంపిణీ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికీ, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి అందించారు. సాయంత్రం ఆరు గంటలకు 68.86 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో 2,43,160 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.67.10 కోట్లు కేటాయించింది. తొలిరోజు 1,67,439 మందికి రూ.46.22 కోట్లు అందజేశారని డీఆర్‌డీఏ వైఎస్సార్‌క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ వీణాదేవి తెలిపారు.

5,795 మందికి ఉపాధి కల్పన

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఇప్పటి వరకూ రూ.273.86 కోట్ల పెట్టుబడితో 1,547 సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి 5,795 మందికి ఉపాధి కల్పించామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ఆమె అధ్యక్షతన 10వ జిల్లా పరిశ్రమల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం ఆసక్తి కలిగిన మరింత మంది లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. గత సమావేశం నుంచి నేటి వరకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులపై అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్షించారు. జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, డీఐవో కె.వెంకటేశ్వరరావు, డివిజనల్ జోనల్ మేనేజర్ డీవీఎస్‌ఎస్ జ్యోత్స్న పాల్గొన్నారు.

సర్కార్ వారి వైద్యం సూపర్

- పేదల కల్పతరువుగా సర్వజన ఆస్పత్రి
- రోగులకు పెరిగిన అపార నమ్మకం
- ఏటేటా పెరుగుతున్న మేజర్ సర్జరీలు
- ఉత్తమమైన నవజాత శిశు విభాగం
- ప్రసూతి సేవల్లో జాతీయ స్థాయి గుర్తింపు



మెడికల్ వార్డులో సేవలు పొందుతున్న రోగులు



వార్డులు	పడకలు
56	1,080

రోజువారీ ఓపీ 2,500 నుంచి 3,000

రోజువారీ ఐపీ 1,800 నుంచి 2,000



2023 అక్టోబర్ వరకు కేసులు		
ఓపీ	:	6,59,814
ఐపీ	:	55,143
మైనర్	:	29,517
మేజర్	:	11,596



జీజీహెచ్‌లోని నవజాత శిశువుల విభాగం

సాక్షిప్రతినిధి–కాకినాడ: ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన కాకినాడ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)రోగులకు మరింత దగ్గరైంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పేదలకు వైద్యం అందించే పెద్ద ఆస్పత్రి ఇది. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మకమైన మార్పులతో జీజీహెచ్ కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నే రీతిలో పనిచేస్తోంది. ఇక్కడి సేవలపై ప్రజల్లో ఇప్పుడు విశ్వాసం రెట్టింపయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక ఇక్కడి ముఖ్యమైన విభాగాలు బాగా మెరుగుపడ్డాయి. కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరో సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలు కార్పొరేట్ ఆస్పత్రులను మించి బలోపేతం అయ్యాయి. గత పాలకుల హయాంలో జీజీహెచ్‌లో దాదాపు అన్ని విభాగాల్లోనూ వైద్యులు, నర్సింగ్, వైద్యేతర సిబ్బంది పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ కాకుండా ఉండేవి. అటువంటి పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వైద్యులు కొరత లేకుండా పోయింది.

కార్డియాలజీలో మెరుగైన సేవలు

ఒకప్పుడు వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రమే కార్డియాలజీ వైద్యసేవలందేవి. అదీ కూడా నామమాత్రంగా ఉండేవి. ప్రస్తుతం కార్డియాలజీ విభాగం మెరుగైన సేవలందించడంలో ముందుంది. కాకినాడ జీజీహెచ్, విశాఖపట్నం కేజీహెచ్‌లకు ఒకే ఒక వైద్యుడు అటు, ఇటు తిరుగుతూ వారానికి రెండు రోజులు సేవలందించేవారు. ఇప్పుడదే విభాగానికి నలుగురు హృద్రోగ నిపుణులు నియమితులయ్యారు. అప్పట్లో ఈ విభాగానికి నెలకు వంద మంది లోపు రోగులు వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య సుమారు రెండు వేలకు చేరింది.

పెరిగిన గ్యాస్ట్రో ఓపీ

గతంలో జీర్ణకోశ వ్యాధులకు బాధపడుతూ జీజీహెచ్‌కు వచ్చే రోగుల పరిస్థితి దయనీయంగా ఉండేది. రెండేళ్లలో ఈ విభాగం ముఖచిత్రమే మారిపోయింది. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల బృందం చక్కని సేవలందిస్తోంది. రోజువారీ ఓపీ కూడా గణనీయంగా పెరిగింది. అలాగే ఖరీదైన ఉపకరణాలు న్యూరో సర్జరీ విభాగానికి సమకూరాయి. న్యూరోసర్జరీలో శస్త్రచికిత్స విషయంలో మరణాల సంఖ్య తగ్గి సక్సెస్ రేటు పెరిగింది. గైనకాలజీ, పీడియాట్రిక్స్ సేవల్లో జీజీహెచ్ రాష్ట్రంలోనే అత్యుత్తమం. రోజూ కనీసం 40 ప్రసవాలు జరుగుతుంటాయి. ఈ విషయంలో జీజీహెచ్‌కు జాతీయ స్థాయిలో లక్ష్య అవార్డు కూడా లభించింది. నవజాత శిశువుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.



సిద్ధమైన క్యాథ్‌ల్యాబ్ భవంతి

నెలాఖరుకు క్యాథ్‌ల్యాబ్

కార్డియాలజీ విభాగంలో కీలకమైంది క్యాథ్‌ల్యాబ్. గత పాలకులు దీని ఏర్పాటుకు ప్రతిపాదించి గాలికి వదిలేశారు. సామాన్య, మధ్య తరగతి రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో హృద్రోగ పరీక్షకు కనిష్ఠంగా రూ.3,000. గరిష్ఠంగా రూ.15,000 వెచ్చించాల్సి ఉంటుంది. మరో ఖరీదైన పరీక్ష ఎంఆర్ఐ. ఇది బయట కార్పొరేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లలో తక్కువగా చూసుకుంటే పరీక్షలను బట్టి రూ.6,000 నుంచి రూ.25వేల వరకు ఉంటుంది. క్యాథ్‌ల్యాబ్, ఎంఆర్ఐ యంత్రాలు నెలాఖరుకు అందుబాటులోకి రానున్నాయి. సిటీ స్కాన్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. డయాలసిస్ సేవల్లో నాణ్యతను పెంచడంతో నిరుపేదలైన రోగులకు జీజీహెచ్ ఒక వరంగా మారింది. జీజీహెచ్‌లో మందుల కొరత లేదు. రోగికి పోషకాహారం కోసం గతంలో రూ.49 వంతున వెచ్చించేవారు. ఇప్పుడు రూ.80 చేశారు. ప్రభుత్వంతో పాటు కోరమాండల్, రిలయన్స్, ఓఎన్‌జీసీ, కేఎస్‌పీఎల్, రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) పూర్వ విద్యార్థులు తలోచేయి వేయడంతో వివిధ విభాగాల్లో సేవలు మెరుగయ్యాయి.

ప్రభుత్వ కృషితో మెరుగుపడ్డ సేవలు



ప్రభుత్వం చొరవ తీసుకుని జీజీహెచ్‌లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. దాదాపు అన్ని విభాగాల్లోనూ సేవలను మెరుగుపరిచింది. ఉమ్మడి జిల్లాలో ఏ మారుమూల గ్రామం నుంచి అయినా రోగులు ఇప్పుడు ధైర్యంగా వస్తున్నారు. అన్ని విభాగాల్లోను సేవలు మెరుగుపడ్డాయి. ముఖ్యమైన విభాగాల్లో ఉపకరణాలు, సిబ్బందిని పెంచడంలో ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది.

– కృతికాశుక్లా, కలెక్టర్, కాకినాడ

అందుబాటులో నిపుణులైన వైద్యులు



కార్పొరేట్‌ను మించిన వైద్యం అందుబాటులోకి వచ్చింది. జీజీహెచ్‌లో వైద్య ప్రమాణాలు మరింత మెరుగయ్యాయి. ఇందుకు అనుగుణంగానే కార్పొరేట్ స్థాయి వైద్యం ఇక్కడ అందుబాటులోకి వచ్చింది. ఆ స్థాయిలో నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు. అవ్వని పరీక్ష లేదు. ఇవ్వని మందు లేదు. పైసా ఖర్చు లేకుండా అత్యంత మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, జీజీహెచ్ సూపరింటెండెంట్

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

- కలెక్టర్ మాధవీలత
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కలెక్టర్ మాధవీలత అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఆమె స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ స్పందన హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా నేడు దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరం కేంద్రంగా ఆవిర్భవించిన తూర్పు గోదావరి జిల్లాను అభివృద్ధి దిశలో తీసుకువెళ్లేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ తెలుగు జాతిని పరిరక్షించుకోవడానికి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఫ్యూచర్ కిడ్స్ చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్‌ఓ జి.నరసింహులు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు సేవా పతకాలు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని పలువురు పోలీసులకు ఉత్తమ సేవ, సేవ పతకాలు లభించాయి. ఈ మేరకు ఏపీ హోంశాఖ బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. ఉత్తమ సేవ పతకం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన బుర్రి రామకృష్ణకు లభించింది.త్రీటౌన్ సీసీఎస్‌కు చెందిన షేక్ ఇష్ఫక్ అహ్మద్ మోహిద్దీన్ షఫీ, ట్రాఫిక్ ఎస్సై మేడా సత్యనారాయణ, ఏఆర్ ఎస్సై కడలి వీరభోగ వసంత రావు, ధవళేశ్వరం హెడ్ కానిస్టేబుల్ మామిడిశెట్టి పద్మరాజు, బొమ్మూరు ఏఎస్సై అల్లంకి జగదీష్, రాజమహేంద్రవరానికి చెందిన ఆర్‌వీఅండ్‌ఈవో ఎస్.ఉమామహేశ్వరరావు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన హెచ్‌సీ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఓఎస్‌జీసీ విభాగంలో హెచ్‌సీ హెచ్.రామారావు, అగ్నిమాపకశాఖ విభాగంలో అనపర్తికి చెందిన ఎస్‌కే. హుస్సేన్‌కు సేవా పతకాలు లభించాయి.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం

- ప్రతి నెలా నాలుగో శనివారం సివిల్ రైట్స్ డే
- కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ రామ్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు ఆదేశించారు. ఆమె అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎస్పీ పి.జగదీష్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జేసీ తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అట్రాసిటీ కేసుల పురోగతిపై రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోపు చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. సామాజిక బహిష్కరణలు విధిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందేలా చూడాలన్నారు. ప్రతి నెలా నాలుగో శనివారం గ్రామాల్లో సివిల్ రైట్స్‌డే నిర్వహించేలా చూడాలని, ఆయా కార్యక్రమాలకు ఎంపీడీవో, తహసీల్దార్ తదితరులు హాజరవ్వాలన్నారు. జిల్లాలో 2016 నుంచి ఇప్పటి వరకూ 92 మంది బాధితులకు రూ.1,11,90,000 పరిహారం మంజూరు చేశామన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు అనుసంధానంగా రక్షణ వ్యవస్థతో పాటు కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరుతేవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని సెంట్రల్ జోన్‌లో 14, తూర్పు జోన్‌లో 10, సౌత్ జోన్‌లో 8, నార్త్ జోన్‌లో 28, కొవ్వూరు డివిజన్ జోన్‌లో 19.. మొత్తంగా 79 కేసులు వివిధ దశలలో విచారణలో ఉన్నాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎస్.అబ్రహం, ఏ.సునీల్ కుమార్, పి.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

చెల్లింపు.. సులభతరం

- పంచాయతీలు,సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు
- నగదు రహిత లావాదేవీలకు ప్రభుత్వం చర్యలు
- 165 పంచాయతీలకు ఈ–పోస్ యంత్రాల పంపిణీ
- స్వైపింగ్ ద్వారా చెల్లింపులకు అవకాశం



పంచాయతీలకు పరికరాలు

కొవ్వూరు: గ్రామ పంచాయతీలో పన్నులు, సచివాలయం వివిధ సేవల రుసుములు చెల్లింపులో నగదు రహిత లావాదేవీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఈ–పోస్ యంత్రాలు (స్వైపింగ్ మిషన్స్)క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. పారదర్శకమైన నగదు రహిత ఆర్థిక లావాదేవీల ద్వారా అవకతవకలకు తావు లేకుండా ఈ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 300 గ్రామ పంచాయతీలున్నాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు ప్రతిపాదించిన తొమ్మిది పంచాయతీలను మినహాయించి మిగిలిన 291 చోట్ల క్యూఆర్ కోడ్, ఈ–పోస్ యంత్రాలు అందజేసింది. మూడువేల పైబడి జనాభా ఉన్న 165 మేజర్ పంచాయతీలకు ఈ–పోస్ యంత్రాలు అందించింది. 3 వేల లోపు జనాభా ఉన్న 126 పంచాయతీల్లో క్యూఆర్ కోడ్‌ల ప్రక్రియ ప్రవేశపెట్టింది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి నగదు రహిత విధానం ప్రారంభమైనా పూర్తి స్థాయిలో జరగడం లేదు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఈ–పోస్ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రజల్లో కూడా అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలన్నీ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(యూబీఐ) ద్వారా చేపట్టనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీలు యూబీఐలో ఖాతాలను తెరిచారు. రాజమహేంద్రవరం యూబీఐ పరిధిలో కాకినాడ, కొనసీమ పరిధిలో 205 పంచాయతీలున్నాయి. ఇప్పటి వరకు ఈ రీజియన్‌లో 470 ఈ–పోస్ యంత్రాలను అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు.

వినియోగదారులు వీసా, మాస్టర్ కార్డులు వాడితే యూజర్ చార్జీల భారం పడే అవకాశముంది. అందుకే రూపే కార్డులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎన్నో ఉపయోగాలు

- ఈ–పోస్ యంత్రం ద్వారా చెల్లించిన వెంటనే రశీదు పొందవచ్చు.
- చెల్లింపు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదవుతాయి.
- అన్నీ బ్యాంకుల ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా ఈ–పోస్ యంత్రంలో స్వైపింగ్ చేయవచ్చు.
- ఫోన్ పే,గూగుల్ పే,పేటీఎం,ఇతర యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను వినియోగించుకోవచ్చు.
- అవినీతికి ఆస్కారం లేకుండా పన్నుల ఆదాయం పంచాయతీ ఖాతాకు జమవుతుంది.
- చెల్లింపులు సులభంగా,వేగంగా పూర్తవుతాయి.

నెలాఖరుకు అన్ని చోట్లా చెల్లింపులు



పంచాయతీలకు ఈ–పోస్ పరికరాలను అందజేశాం. రూపే కార్డుల ద్వారా చెల్లిస్తే ఏవిధమైన యూజర్ చార్జీలుండవు. 291 పంచాయతీలతో యూబీఐలో ఖాతాలు తెరిపించాం. నెలాఖరు నాటికి అన్నీ చోట్ల నగదు రహిత లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. సీతానగరం మండలంలో ఇప్పటికే ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చాం.

– జె.సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో 375 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



జగదీష్, ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగంగా మద్యం తాగే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గత నెల మూడు నుంచి 31వ తేదీ వరకూ చేపట్టిన డ్రంక్ అండ్, బహిరంగ మద్యం కేసుల వివరాలను బుధవారం ఆయన వివరించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 375 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న 900 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం విజిబుల్ పోలీసింగ్, ప్రత్యేకంగా పోలీసు బృందాలతో రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమైన సెంటర్లలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగడం వల్ల అనేక మంది జీవితాలు నాశనం అవుతున్నాయని, ఆ మత్తులో డ్రైవింగ్ చేయటంతో ప్రమాదాలు జరిగి ఇతరుల ప్రాణాలకు ఆపద వాటిల్లుతోందన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన వ్యక్తులకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి, రెండోసారి పట్టుబడిన వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్ రద్దు చేసేందుకు ఆర్టీవోకు సిఫారసు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి బాక్సింగ్ అండర్-14, 17 పోటీలను బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. చింతలపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 160 మంది బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకి రామయ్య, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, బాక్సింగ్ కోచ్‌లు చిట్టూరి చంద్రశేఖర్, బొంతు మధుకుమార్ పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి సీజ్

ఆత్రేయపురం: మండల పరిధిలోని ర్యాలి గ్రామంలో బుధవారం ఇడుగుల రామకృష్ణ ఇంటి ఆవరణలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.44,900 విలువ చేసే మందు గుండు సామగ్రిని సీజ్ చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. నిందితుడు రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొదల్లో మహిళ మృతదేహం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

తుని: స్థానిక పాయకరావుపేట నాగరాజుపేట రైల్వేగేటు వద్ద పట్టాల పక్కన పొదల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించామని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లగా... రైల్వేగేటు సమీపంలోని పొదల్లో 35 ఏళ్ల మహిళ మృతదేహం లభించిందన్నారు. మృతురాలి ఒంటిపై తెలుపు, పసుపు రంగులు కల చేతి వర్కు కలిగిన టాప్, నలుపు రంగు లెగ్‌ఇన్, నాలుగు అడుగుల దూరంలో ఎరుపు రంగు చున్నీ ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అటెండెన్స్ ఉంటేనే హెవీ లైసెన్స్

- డ్రైవింగ్ స్కూల్‌లో ఇక హాజరు అమలు పక్కా
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇన్‌స్ట్రక్టర్, శిక్షణ పొందేవారికి బయోమెట్రిక్ హాజరు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 12 డ్రైవింగ్ స్కూళ్లు
- ఏటా 3వేల భారీ వాహన డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ



ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన బ్యాచ్ (ఫైల్)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి పారదర్శకంగా సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా చేయి తడపనిదే పనికాదంటూ ప్రాచుర్యం పొందిన రవాణాశాఖ కార్యాలయంలో పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపట్టింది. ఇప్పటికే దాదాపు 30కి పైగా సేవలు సచివాలయాల ద్వారా అందిస్తోంది. తాజాగా భారీ వాహనాలు నడపడానికి జారీచేసే హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ల పొందాలను కొనేవారికి డ్రైవింగ్ స్కూల్లో బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. ఇందుకు సంబంధించి గత ఏడాది నవంబర్‌లో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయగా తాజాగా గెజిట్ విడుదల చేసింది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ముందుగా ఎల్ఎల్ఆర్ పొంది, ఆరు నెలల్లో గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్ల ద్వారా సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. వారు జారీచేసిన సర్టిఫికెట్ ద్వారా ఎంవీఐ హోదా కలిగిన అధికారి లైసెన్స్ జారీ చేస్తారు. గతంలో ఈ సర్టిఫికెట్ కోసం డ్రైవింగ్ స్కూల్‌కి రోజూ వెళ్లకపోయినా పని అయిపోయేది. నెల చివరలో వెళ్లి ఒకేసారి 30 రోజుల సంతకాలు చేసేసి, డబ్బు చెల్లిస్తే ఇచ్చేసేవారు. ఈ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి నెలరోజులపాటు రోజూ శిక్షణకు హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉదయం తరగతులు, మధ్యాహ్నం డ్రైవింగ్ పరీక్షలు ఇప్పటికే నిర్వహిస్తుండగా తాజాగా రవాణాశాఖ చట్ట సవరణ చేసింది.

నిబంధనలు ఇవే..

- శిక్షణ పొందేవారు, శిక్షణ ఇచ్చే ఇన్‌స్ట్రక్టర్లు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- డ్రైవింగ్ స్కూల్లో 25 మంది బ్యాచ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టరు ఉండాలి.
- ఇన్‌స్ట్రక్టరుకు తప్పనిసరిగా డిప్లమా ఇన్ మోకానికల్ ఇంజినీరింగ్ లేదా, డిప్లమా ఇన్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ లేదా ఐటీఐలో డిజిల్ మెకానిక్ చేసి ఉండాలి.
- ప్రతి డ్రైవింగ్ స్కూల్.. ఫీజు చెల్లింపు, శిక్షణ స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ శిక్షణ తదితరాల కోసం ఒక ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తీసుకురావాలి.
- రవాణాశాఖ నిర్దేశించిన ఫీజునే వసూలు చేయాలి.
- శిక్షణ పొందే వారికి హాస్టల్ సదుపాయం ఉండాలి. ముఖ్యంగా ప్రతి డ్రైవింగ్ స్కూల్ స్వంత ట్రాక్ కలిగి ఉండాలి.

ఇదీ లెక్క..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవింగ్ స్కూళ్లు	-	12
ఆర్టీసీ ద్వారా నిర్వహించేవి	-	3
ప్రైవేట్‌గా నడుస్తున్నవి	-	9
తరగతులు నిర్వహించే రోజులు	-	30
ఏటా జారీ చేసే భారీ వాహన లైసెన్స్‌లు (దాదాపు)	-	3,000

కొత్త మార్పులతో గెజిట్



రాష్ట్ర ప్రభుత్వం హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీ విధానంలో కొత్తగా మార్పులు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ఏంవీఐ స్థాయి అధికారిని డ్రైవింగ్ స్కూల్ పర్యవేక్షణకు నియమించాం. రోజూ అభ్యర్థి తరగతులకు హాజరుకావలసిందే. తరగతికి హాజరైన వారి సంఖ్య ఏరోజుకారోజు ఆన్‌లైన్ ద్వారా సమీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. శిక్షణకు పూర్తిగా హాజరుకావడం ద్వారా డ్రైవింగ్‌లో మెళకువలతో పాటు జాగ్రత్తలపై అవగాహన కలుగుతుంది. నిబంధనలు పాటించని డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం.

– ఎ.మోహన్, డీటీసీ, కాకినాడ

ఈ పురస్కారం తెలుగు భాషకు పట్టాభిషేకం

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం



నల్లజర్ల: తెలుగు భాషా సాహిత్య విభాగంలో వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంటు అవార్డు -2023 తీసుకోవడం తెలుగు భాషకు పట్టాభిషేకం చేసినట్టుందని సాహితీ వేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అన్నారు. ఆయన బుధవారం విజయవాడలో అవార్డు తీసుకున్న సందర్భంగా తన ఆనందాన్ని ఫోన్ ద్వారా నల్లజర్లలోని చిన్ననాటి మిత్రులతో పంచుకున్నారు. ఏదైనా ఒక రంగంలో విశేష కృషిచేసిన వారిని గుర్తించి అభినందించాలని ప్రభుత్వం సంకల్పించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా చాలా పురస్కారాలు అందుకున్నాను గాని ఇటువంటి పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఎవరైనా రూ.పది వేలు, రూ.పాతిక వేలు పారితోషకంగా ఇస్తారు. ఈ రోజుల ఇచ్చిన రూ.10లక్షలు ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింప చేసే విధంగా ఉందన్నారు. ఇటువంటి పురస్కారాలు అందించడం ఎంతో ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. అవార్డు అందుకున్నవారు రెట్టింపు ఉత్సాహంతో పని చేసి సమాజానికి మరిన్ని సేవలు చేయడానికి దోహదపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ,ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఆయన తల్లి విజయమ్మకు, గవర్నరుకు, ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

సమష్టి సహకారంతో అభివృద్ధి



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న వర్సిటీ డైరెక్టర్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏ వ్యవస్థలోనైనా సమష్టి సహకారం ఉంటేనే అభివృద్ధి సాధించవచ్చని, అదే తరహాలో జేఎన్‌టీయూకే ప్రగతి పథంలో పయనిస్తోందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం వర్సిటీ సమావేశపు హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విజన్‌కు అనుగుణంగా విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ ఎంబీఏ, ఆర్టిఫిషియల్ వంటి కోర్సులు ప్రారంభిస్తున్నామని, త్వరలో 10వ స్నాతకోత్సవం నిర్వహణకు సిద్ధమవుతున్నామన్నారు. అనంతరం డైరెక్టరేట్‌ల వారీగా ప్రగతి వివరించారు. సాయంత్రం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో టీచింగ్, నాన్‌టీచింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వీసీ ప్రసాదరాజును సత్కరించారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, డీఏఏ సాయి బాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం

- వాడపల్లిలో నేటి నుంచి 10 వరకు సందడి
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ముస్తాబైన ఆలయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి శ్రీనివాస కల్యాణం, మహా సుదర్శన హోమం, అష్టదళ పాదపద్మారాధన, అష్టోత్తర కలశాభిషేకం, సుప్రభాత సేవ, అష్టోత్తర శతకలశాభిషేకం, నవగ్రహ హోమం, తిరుప్పావడ సేవ, లక్ష కుంకుమార్చన, మహాపుష్పయాగం, శ్రీ వేంకటేశ్వరస్వామి హోమం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ నిర్వహిస్తారు. వైఖానస ఆగమోక్తంగా బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ఈ కార్యక్రమాలు సాగుతాయి.

కోర్కెలు తీర్చే ఏడు వారాల స్వామి

సుమారు మూడు శతాబ్దాలకు పూర్వం ఆలయం ఏర్పడింది. స్వామివారు ఎర్ర చందనం విగ్రహ రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయం గౌతమీ గోదావరికి చేరి ఉండటంతో భక్తులు నదిలో స్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామి వెలుగొందుతున్నారు. దీంతో ప్రతి శనివారం ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ఆలయానికి క్షేత్ర పాలకుడిగా శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వ్యవహరిస్తున్నారు. స్వామివారి ప్రధాన



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆలయంతో పాటు వేణుగోపాలస్వామి, ఆండాళ్ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ఈ ఆలయానికి సుమారు 350 ఏళ్లకు పూర్వం పెద్దాపురం సంస్థానాధీశులు రాజా వత్సవాయి తిమ్మజగపతిరాజు 275 ఎకరాల భూమిని, స్వామి వారికి మరో 100 ఎకరాలు అందించారు. స్వామివారి దర్శనానికి వచ్చేవారి సంఖ్య రోజు రోజుకు పెరగడంతో ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి అమలు చేస్తోంది. ప్రముఖ టూరిస్టు కేంద్రంగా వాడపల్లి ఆలయాన్ని తీర్చి దిద్దడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఆలయంలో పార్కింగ్ స్థలాల అభివృద్ధి, అన్నదాన భవనం నిర్మాణం, భక్తుల సేవలకు ఆధునిక యంత్రాల ఏర్పాటు వంటి చర్యలు తీసుకున్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, ఋత్విక్ వరుణ, దీక్షాధారణ, విశేషార్చన, నీరాజనం, సాయంత్రం వాస్తు హోమం, ధ్వజపతాక హోమాలు, శేషవాహన సేవ

5న చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ) : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న బాలల దినోత్సవం సందర్భంగా అండర్ 15 విభాగంలో ది రాజమండ్రి ఐరన్ పెయింట్స్ మర్చంట్ అసోసియేషన్ హాలులో చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొన దలిచిన క్రీడాకారులు ఒక రోజు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 98853 02468 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- హోంమంత్రి వనిత
- కిర్లంపూడిలో నూతన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం



పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి వనిత

కిర్లంపూడి: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకమని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. కిర్లంపూడిలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పోలీసు వ్యవస్థను మెరుగుపరిచేందుకు అనేక చర్యలు తీసుకున్నారన్నారు. పోలీసు శాఖలో ఉన్న ప్రతీ అధికారికి సీఎం స్వేచ్ఛను ఇచ్చారన్నారు. దీనివలన ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను నిర్వహిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం జీరో ఎఫ్ఐఆర్‌ని తీసుకువచ్చిందని, మహిళలందరికీ భద్రత కల్పించడం కోసం దిశ బిల్లును తీసుకువచ్చిందని, త్వరలోనే ఈ చట్టం ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిశ యాప్‌ను తీసుకువచ్చి మహిళలకు భద్రత ఇస్తున్నారన్నారు. దీర్ఘకాలంగా ఇక్కడ పోలీస్‌స్టేషన్ అద్దెభవనంలో ఉండటం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ భవన నిర్మాణానికి రూ.కోటి ఖర్చయిందని, భవన నిర్మాణానికి సీఎస్ఆర్ ఫండ్స్ తీసుకువచ్చి సహకరించిన కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో పాటు పోలీసు అధికారులను, ఇతర దాతలను అభినందించారు. కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, జక్కంపూడి రాజా, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యురాలు తోట సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, సర్పంచ్ ఎం.శ్రీలత, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు, ఎస్సైలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



స్పందన

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన పండా స్పందన గత నెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయిందని భర్త రమేష్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆమె కోసం తన బంధువుల ఇంటితో పాటు పలు ప్రాంతాల్లో గాలించగా ఫలితం లేకపోవడంతో భర్త ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సెంట్రల్ జైలు నుంచి క్షమాభిక్షపై ఇద్దరు ఖైదీలు విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి క్షమాభిక్షపై బుధవారం ఇద్దరు ఖైదీలు విడుదలయ్యారు. ఈ మేరకు ఆ వివరాలను కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. అజాదికా అమృత్ మహోత్సవ్ ఫేజ్ -3లో భాగంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. 75 ఏళ్లు పైబడిన కడియంకు చెందిన మల్లెమొగ్గల శివ, పి.గన్నవరానికి చెందిన సానబోయిన గోపాలకృష్ణలకు క్షమాభిక్ష లభించింది.

టీడీపీ నాయకులపై కేసు

రంగంపేట: పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్టు ఏఎస్ఐ కె.నూకరాజు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన మండల పరిధిలోని వడిశలేరులోమాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు ఆళ్ల గోవిందు, ఎలుగుబంటి సత్తిబాబుతో పాటు జనసేన నాయకులు, అనుమతులు తీసుకోకుండా బైక్ ర్యాలీ చేపట్టారు. చాగల్నాడు కాలువకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ చేశారు. అనపర్తి సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఈ కారణంగా వారందరిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

'నన్నయ'లో అధ్యాపక ఖాళీల భర్తీకి చర్యలు

- 99 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- నవంబరు 27లోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఉపకులపతి ఆచార్య పద్మరాజు



ఉపకులపతి ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బోధన విభాగంలో ఖాళీగా ఉన్న 99 పోస్టుల భర్తీకి ప్రభుత్వపరంగా నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలోని 18 యూనివర్సిటీలలో 3,220 ఖాళీలను భర్తీ చేస్తూ ఉమ్మడి నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో 'నన్నయ' యూనివర్సిటీకి సంబంధించిన వివరాలను ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు వివరించారు. ఈ 99 పోస్టులలో 14 ప్రొఫెసర్, 22 అసోసియేట్ ప్రొఫెసర్ కాగా వీటిలో 20 రెగ్యులర్, రెండు బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులున్నాయి. 59 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులలో 57 రెగ్యులర్, రెండు బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు. మరో నాలుగు ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు (మూడు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్) ఉన్నాయి. ఉన్నత విద్యామండలి ఆదేశాలను అనుసరించి ఉమ్మడి పోర్టల్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా అర్హతలున్న అభ్యర్థులు తగిన ఫీజు చెల్లించి, నవంబర్ 27 లోగా దరఖాస్తు చేసుకోవాలి.

'నన్నయ'లో ఇదే మొదటి నోటిఫికేషన్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ 2006 ఏప్రిల్ 22న ఏర్పడింది. అప్పటి నుంచి బోధన విభాగంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడం ఇదే ప్రథమమని చెప్పవచ్చు. ప్రస్తుతం అడ్‌హక్ అధ్యాపకులతో నడుస్తూ వస్తున్న యూనివర్సిటీకి ఇకపై రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న అడ్‌హక్, తాత్కాలిక అధ్యాపకులకు కూడా మేలు చేకూర్చే విధంగా ఈ నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించారు. యూనివర్సిటీలో ప్రస్తుతం పనిచేస్తున్న అడ్‌హక్ అధ్యాపకులకు 10 శాతం వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఈ 10 శాతం వెయిటేజ్ మార్కులను వారు పనిచేసిన కాలానికి ఏడాదికి ఒక మార్కు చొప్పున లెక్కిస్తారు.

దరఖాస్తు ఫీజుల వివరాలు

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఓపెన్ కేటగిరీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.2,500, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైన అభ్యర్థులు రూ.2 వేలు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ విభాగాలలో పరీక్షలు రాయాలనుకునే వారు మాత్రం విడివిడిగా ఫీజులు చెల్లించవలసి ఉంటుంది. ఇక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు మాత్రం అన్ని కేటగిరీల అభ్యర్థులు రూ.3 వేలు ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. రాష్ట్రంలోని 18 యూనివర్సిటీలకు సంబంధించిన వెబ్‌సైట్‌లలో వీటికి సంబంధించిన అన్ని వివరాలు ఉన్నాయి.

కొబ్బరిని కొంటాం

ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకరరావు



అంబాజీపేట నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రం వద్ద ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకరరావు తదితరులు

అంబాజీపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్ కొనుగోలు కేంద్రాలలో కొబ్బరిని కొనుగోలు చేస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో నాఫెడ్ కేంద్రం వద్ద రైతులు తెచ్చిన కొబ్బరిని బుధవారం కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రంలో కొబ్బరిని విక్రయించే రైతుల వివరాలను ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి మాత్రమే కొబ్బరిని కొనుగోలు చేస్తామన్నారు. తయారైన కొబ్బరి రైతుల వద్ద సిద్ధంగా ఉంటే ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో రైతు పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సీఎం యాప్ ద్వారా రైతులతో కొబ్బరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయన్నారు. ఇప్పటి వరకు వివిధ గ్రామాల్లో 25 మంది కొబ్బరి రైతులు ఆర్బీకేల్లో నమోదు చేయించుకున్నారని వారి వద్ద నుంచి త్వరలో కొబ్బరిని కొనుగోలు చేయనున్నామన్నారు. కొబ్బరిని తయారు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొబ్బరి తేమ శాతం , దుమ్ము ధూళి తదితర అంశాలను రైతులు పాటించాల్సి ఉందన్నారు. మిల్లింగ్ కోప్రాకు రూ.10,860, బాల్ కోప్రాకు రూ.11,750 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొబ్బరిని విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. వీహెచ్ఏ గుత్తుల రత్నకుమారి, రైతులు ముత్యాల జమ్మిలు, ఉప్పుగంటి భాస్కరరావు, మేడేపల్లి వెంకన్న, అరిగెల సూరిబాబు పాల్గొన్నారు.